## కేన్సర్‌పై పరిశోధన చేసిన విశ్వనాథ్‌కు డాక్టరేట్‌



పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో ఫార్మసీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వై.విశ్వనాథ్‌కు డాక్టరేట్‌ డిగ్రీని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రదానం చేసింది. విశ్వనాథ్‌ చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు కవిత వార్ష్రే, శివరాజ్‌ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. 'ఇన్‌కిలికో ఆప్టిమైజేషన్‌, సింథసిస్‌, ఇన్‌విట్రో అండ్‌ ఇన్‌వివో ఇవాల్యుయేషన్‌ ఆఫ్‌ నావెల్‌ ఆండ్రోగ్రాఫోలైడ్‌ అనలాగ్స్‌ యాజ్‌ పీఎల్‌కే ఇన్‌హిబిటర్స్‌ ఇండ్యూసింగ్‌ ఎంపాప్‌టోటిస్‌ ఇన్‌బ్రెస్ట్‌ కేన్సర్‌' అనే అంశంపై విశ్వనాథ్‌ చేసిన విశ్లేషణాత్మక పరిశోధనకు డాక్టరేట్‌ పట్టా లభించింది. పరిశోధనలో భాగంగా ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా న్యూఢిల్లీలోని ఇండియన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ మెడికల్‌ రీసెర్చ్‌ నుంచి సీనియర్‌ రీసెర్చ్‌ ఫెలోషిప్‌ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా విశ్వనాథ్‌ను ఎస్‌ఎన్‌ఆర్‌జీ చైర్మన్‌ నల్ల నర్సింహారెడ్డి, డైరెక్టర్‌ డా.సీ.వీ.కృష్ణారెడ్డి, ఫార్మసీ విభాగం డీన్‌ డా.కృష్ణమోహన్‌ చిన్నాల, అధ్యాపక బృందం అభినందించారు.

## ఎయిర్‌ఫోర్స్‌ అధికారిగా గురుకుల పూర్వ విద్యార్థిని



కావ్య

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ భువనగిరి మహిళా కళాశాల పూర్వ విద్యార్థిని వెలుదొండి కావ్య (2021–24) ఐఏఎఫ్‌ లాజిస్టిక్‌ బ్రాంచ్‌ ఎయిర్‌ ఫోర్స్‌ ఆఫీసర్‌గా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీలత తెలిపారు. దుండిగల్‌ వైమానిక ఎయిర్‌ఫోర్స్‌ ఆఫీసర్‌ ఆమె జూన్‌ 28, 29న విధుల్లో చేరనుంది. ఆర్మీ కళాశాలలో ఆమె సైనిక శిక్షణ పొందింది. ఈ సందర్భంగా ఎయిర్‌ఫోర్స్‌ అధికారిగా ఎంపికైనందుకు కళాశాల కోచ్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు కావ్యను అభినందించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

శామీర్‌పేట్‌: అర్హులైన ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోతారంలో మేడ్చల్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ నర్సింహులుయాదవ్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేదల కోసం కాంగ్రెస్‌ ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు అవుతందని, ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. మాజీ వైస్‌ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్‌, జగన్నాథం, వెంకటరమణారెడ్డి, దామోదర్‌రెడ్డి, నాయకులు హరిమోహన్‌రెడ్డి, వెంకట్‌ రెడ్డి, రుక్మారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

మేడ్చల్‌రూరల్‌ : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ ఆసుపత్రిలో పలు ఇంజినీరింగ్‌ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. చైర్మన్‌ గోపాల్‌రెడ్డి, బోస్‌, రాజిరెడ్డి, అలీబేగ్‌, దుర్గాప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



అనిత

పోచారం: మహిళ అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడలోని వైష్ణవి కాలనీకి చెందిన అనిత (60) శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో ఆమె కుమారుడు శ్రీనివాస్‌ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు మతిస్థిమితం సరిగ్గా లేదని సమాచారం.

## అంబేడ్కర్‌ విగ్రహం పాక్షికంగా ధ్వంసం



పోచారం: యంనంపేట్‌లోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విగ్రహం చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌ రాడ్లు, విగ్రహానికి ఉన్న కళ్లజోడును తొలగించారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పోచారం ఐటీ కారిడార్‌ పోలీస్‌ స్టేషన్‌లో బీజేపీ నేత పాండురాజు, బీఆర్‌ఎస్‌ ఎస్సీసెల్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు మీసాల రాజేష్‌ ఫిర్యాదు చేశారు.

# వంద రోజుల ప్రణాళిక..
# అభివృద్ధికి రూపకల్పన

• నివాసయోగ్యమైన నగరంగా నవీకరణ • తొలగనున్న సమస్యల వలయం



పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటుతున్న మున్సిపల్‌ సిబ్బంది

పోచారం: మున్సిపల్‌ ప్రాంతాలను నివాసయోగ్యం, పర్యావరణ అనుకూల నగరాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్‌ 2న మొదలైన ఈ ప్రణాళిక సెప్టెంబర్‌ 10వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రణాళిక ద్వారా పోచారం పుర ప్రజలకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. ప్రతిరోజూ 'ఒక చర్య – ఒక మార్పు' అనే నినాదంతో కార్యక్రమం కొనసాగుతోంది. నూతన మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, ప్రజల భాగస్వామ్యాన్ని సమ్మిళితం చేసి 'ప్రజలే ముందు' అనే విధానంతో పట్టణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా 100 రోజుల ప్రణాళిక చేపట్టారు.

### సరికొత్త మార్పునకు సన్నాహాలు...

వాక్‌విత్‌ కమిషనర్‌, ర్యాలీలు, ప్రతిజ్ఞ వంటివి నిర్వహిస్తూ.. ప్రణాళికాబద్ధంగా పనిచేసి, పోచారం మున్సిపాలిటీకి సరికొత్త రూపు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. మౌలిక సదుపాయాలను కల్పిస్తూ.. స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. రోజూవారీ పురోగతిపై నివేదికలను రూపొందిస్తున్నారు.

### గ్రీన్‌ ప్రోటోకాల్‌ అమలుకు కృషి...

నాలాలలో పూడికతీత, చెత్తను వేరుచేసే విధానాన్ని అవలంభించడం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన, సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నిషేధంతో పాటు గ్రీన్‌ ప్రోటోకాల్స్‌ అమలు, ఇంటివద్ద కంపోస్ట్‌ తయారుచేసే పద్ధతులను ప్రోత్సహించి మున్సిపాలిటీలో ల్యాండ్‌ఫిల్‌పై భారాన్ని తగ్గించడం, రోడ్డు పక్కన పిచ్చిమొక్కల తొలగింపు, దోమల నియంత్రణ, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, నీటి వనరులను శుభ్రం చేయడం, లోతట్టు ప్రాంతాల్లోని గుంతలను పూడ్చడం, శిథిల భవనాల తొలగింపు, జంక్షన్ల అభివృద్ధి, వీధికుక్కల సంతాన నియంత్రణ, ఇంకుడు గుంతల ఏర్పాటు వంటి కార్యాచరణతో పట్టణం నవీకరణ దిశగా అడుగులు వేస్తోంది.

### తొలగనున్న సమస్యల వలయం...

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలు, కుక్కల బెడద వంటి సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజలు ఆశిస్తున్నారు. స్థానిక సమస్యల వలయాన్ని తొలగించేందుకు పోచారం మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక పురోగమిస్తోంది.

### రోజుకో కార్యక్రమం చేపడుతున్నాం



వంద రోజుల కార్యాచరణలో భాగంగా రోజుకో కార్యక్రమాన్ని చేపట్టి వినూత్నంగా ప్రణాళికను అమలు చేస్తున్నాం. సిబ్బంది, ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. దీనికి అవసరమైన చర్యలను ముందస్తుగానే తీసుకుంటున్నాం.

– వీరారెడ్డి, కమిషనర్‌, పోచారం మున్సిపాలిటీ

### సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి



పోచారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి. 100 రోజుల కార్యక్రమంతో ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తున్నాం. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను కూడా సంబంధిత అధికారులు పరిశీలించి వేగంగా పరిష్కరించాలని కోరుతున్నాను.

– కోన మల్లేష్‌, అన్నోజిగూడ

## నూతన కలెక్టర్‌ను కలిసిన టీజీవోస్‌ ప్రతినిధులు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, మల్కాజ్‌గిరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మనుచౌదరిని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం(టీజీవోస్‌) అధ్యక్షుడు వినోద్‌కుమార్‌ సంఘం ప్రతినిధులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్‌ అధికారుల సంఘం (టీజీవోస్‌) జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహ అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షులు రవీందర్‌, రఘునందన్‌గౌడ్‌, కృష్ణ, ఝాన్సీరాణి, విజయకుమారి, సంయుక్త కార్యదర్శి ఆనందరావు, కోశాధికారి కరుణాకర్‌రావు, కార్యాలయ కార్యదర్శి సాయికృష్ణ, కార్యవర్గసభ్యుడు తిరుపతి ఉన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్‌: దశలవారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్‌ డివిజన్‌ బ్రహ్మపురి కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, మీనానగర్‌లో రూ.3.5 లక్షలతో డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవసరమైన చోట డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు, అనంతరం సీసీరోడ్లు వేయిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. జలమండలి మేనేజర్‌ సిరాజుద్దీన్‌, స్థానిక కాలనీవాసులు విశ్వరూపచారి, బేతాల మల్లేష్‌, నాగమల్లేష్‌, రవి, నర్సింహ్మా, బీఆర్‌ఎస్‌ నేతలు కుంటి కృష్ణ, తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్‌, వాసుగౌడ్‌, ప్రవీణ్‌, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి యోగా దివ్య ఔషధం

రామంతాపూర్‌ : సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన ఒక దివ్య ఔషధం లాంటిదని, యోగా అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా శాశ్వత ప్రతినిధి యోగా గురువు బొడ్డు రవీందర్‌ అన్నారు. శనివారం రామంతాపూర్‌ నెహ్రూనగర్‌ కమ్యూనిటీ హాల్‌లోని యోగా కేంద్రంలో నిర్వహించిన అభ్యాసకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 12 ఏళ్లుగా నిరంతరంగా యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 16 నుంచి నెలరోజుల పాటు ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు 9246222889.

## మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో గంగపుత్ర సంఘం సభ్యులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జగదీష్‌గౌడ్‌, కాలనీవాసులు

గౌతంనగర్‌: డివిజన్‌ మల్లికార్జుననగర్‌లోని గంగపుత్ర సంఘానికి పవర్‌బోర్‌, మౌలిక వసతులు కల్పించాలని శనివారం గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గంగపుత్ర సంఘానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు మేకల రాముయాదవ్‌, గంగపుత్ర సంఘం ప్రతినిధులు బాలయ్య, ఐలయ్య, బిలయ్య, విశ్వనాథ్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్పీనగర్‌ ప్రాథమిక పాఠశాలలో వసతుల లేమి..

మల్కాజిగిరి: సర్దార్‌ పటేల్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో వసతులు కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా జగదీష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటున్నారని, స్కూల్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని కోరామన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. లక్ష్మణ్‌రావు, రాములు, శ్రీనివాస్‌గౌడ్‌, అశోక్‌గౌడ్‌, సునీత, వసంత, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

## సాకేత్‌లో నివాసితుల నిరసన

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలోని సాకేత్‌ భూ సత్వాలో శనివారం ఫేస్‌–1, సాకేత్‌ ప్రణామం నివాసితులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సాకేత్‌ బిల్డర్లు అన్ని సౌకర్యాలు కల్పించలేదని, అసంపూర్తి పనులే చేశారని, ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌ సభ్యులు ఆరోపించారు. దీనిపై తాము రేరా కోర్టుకు వెళ్లినట్లు చెప్పారు. కాగా నివాసితులకు నిబంధనల ప్రకారం అన్ని రకాల వసతులు కల్పించామని బిల్డర్లు చెబుతున్నారు. రేరా కోర్టులో సైతం తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని కొందరు తమపై దుష్ప్రచారం చేసి, కావాలనే తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మేడ్చల్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసిరేగడి గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌ సమీపంలో అర్ధరాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రోడ్డుపై నడుచుకుంటూ.. వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు కాగా.. గమనించిన వాహనదారులు 108కు సమాచారం అందించారు. వారు క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడా పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్‌: తెలంగాణ క్రీడా పాఠశాలలో నాల్గో తరగతిలో ప్రవేశానికి ఈనెల 17న పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో మండలస్థాయి ఎంపిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్‌ మండల విద్యాధికారి శ్రీధర్‌ తెలిపారు. మూడో తరగతి ఉత్తీర్ణత సాధించి 01.09.2016 నుంచి 31.08.2017 జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బోనాఫైడ్‌, మూడో తరగతి ప్రోగ్రెస్‌కార్డు, 5 పాస్‌పోర్ట్‌ సైజు ఫొటోలతో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జెడ్పీ బాలుర పాఠశాలలో రిపోర్ట్‌ చేయాలన్నారు. జూన్‌ 15లోగా టీజీఎస్‌ఎస్‌ వెబ్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 9640501084.

## వారాంతపు సంతలు

మేడ్చల్‌: మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారంతపు సంతల సమాచారం వారాల వారీగా ఈ విధంగా ఉంది. సోమవారం రైల్వే స్టేషన్‌ రోడ్డు (పోలీస్‌ క్వార్టర్స్‌ రోడ్డు), అత్వెల్లి, రాఘవేంద్రనగర్‌ కాలనీ, మంగళవారం ఉమానగర్‌, కేఎల్‌ఆర్‌ విజయానగర్‌, బుధవారం ఎన్‌జీటీస్‌ కాలనీ (మేడ్చల్‌), గురువారం వీకర్‌ సెక్షన్‌ కాలనీ(జెడ్పీహెచ్‌ఎస్‌ స్కూల్‌ వద్ద), శుక్రవారం సూర్యనగర్‌, చంద్రానగర్‌, శనివారం హౌసింగ్‌బోర్డ్‌ కాలనీ, కిష్టాపూర్‌, చెక్‌పోస్టు, ఆర్టీసీకాలనీ, ఆదివారం ప్రధాన మార్కెట్‌లో ఉంటాయి.



## సీఎంఆర్‌సెట్‌లో విద్యార్థులకు ప్రాజెక్ట్‌ పోటీలు



విద్యార్థుల ప్రదర్శనలు పరిశీలిస్తున్న పరిశ్రమ నిపుణులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్‌ కళాశాలలో 'బడ్‌ టూ బిజినెస్‌' (బీ టూ బీ)పేరిట విద్యార్థులకు ప్రాజెక్ట్‌ కాంపిటీషన్‌ నిర్వహించారు. సీఎంఆర్‌ గ్రూప్స్‌ కార్యదర్శి గోపాల్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా.. పోటీల్లో 300 జట్లు పాల్గొన్నాయి. 70 జట్లు ఎంపిక కాగా.. పరిశ్రమ నిపుణులు పోటీల్లో పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన 3 జట్లకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. సీఎంఆర్‌ గ్రూప్స్‌ సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్‌ నారాయణ, ప్రిన్సిపాల్‌ శేషుకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

## తడి,పొడి చెత్తను వేరు చేయాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్‌: ఇంటి యజమానులు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలని బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం 19వ డివిజన్‌లో బృందావన్‌కాలనీలో స్థానిక కాలనీవాసులకు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను ఖాళీస్థలాలు, రోడ్లపై వేయకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.



కండ్లకోయ శివారులో డంపింగ్‌ యార్డు

## చెత్తతో ఇబ్బందులు !



మేడ్చల్‌: తూంకుంట–గుండ్లపోచంపల్లి సరిహద్దులో ఉన్న ప్రాంతంలో అధికారులు చెత్తను డంప్‌చేసి, డంపింగ్‌యార్డు తయారు చేయడంతో సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కండ్లకోయ నుంచి సాయిగీత ఆశ్రమం వెళ్లే రోడ్డులో అధికంగా కంపెనీల గోదామ్‌లు, వేర్‌హౌజ్‌లు ఉన్నాయి. కాగా సాయిగీత ఆశ్రమం, ప్రైవేటు పాఠశాలలు, పోలీస్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ ఇలా అన్ని ఆ రూట్లోనే ఉన్నాయి. గోదామ్‌ల మధ్య ప్రభుత్వ స్థలం అక్కడ ఉండటంతో మున్సిపల్‌ అధికారులు మున్సిపాలిటీల నుంచి వెలువడే చెత్తను ఆటో, ట్రాక్టర్లలో తీసుకువచ్చి డంప్‌ చేస్తున్నారు. దీనికితోడు అక్కడే చెత్తను తగులబెడుతుండటంతో పొగ సమస్య తీవ్రతరమైంది. వ్యాపారాలు, నివాసాల మధ్య వ్యర్థాలు పారవేయకుండా చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# యువ వికాసం.. వాయిదాల పర్వం !

### ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

- నిధులు లేక అమలులో ఆపసోపాలు
- శివారుల్లో దరఖాస్తులు 66,648
- మంజూరైన యూనిట్లు 24,610 మాత్రమే..

సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన 'రాజీవ్‌ యువ వికాసం' పథకం అమలులో వాయిదాల పర్వం కొనసాగుతోంది. ఈ పథకానికి సంబంధించి రుణ లక్ష్యం తక్కువగా ఉండటం, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో ఇప్పట్లో ఈ పథకం పట్టాలపైకి వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని నిరుద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

☛ రాయితీపై రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణాలు అందించాలనే ఉద్దేశంతో యువత నుంచి నెల రోజుల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలు వేర్వేరుగా దరఖాస్తులు స్వీకరించాయి. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు, 4 మున్సిపల్‌ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలు, జీహెచ్‌ఎంసీ పరిధిలోని 8 మున్సిపల్‌ సర్కిళ్లకు సంబంధించి 24,648 యూనిట్లు మంజూరు కాగా.. దరఖాస్తులు మాత్రం 66,648 వచ్చాయి. ఈ నేపథ్యంలో రూ.50 వేల యూనిట్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికార యంత్రాంగం గుర్తించిన అర్హులకు ఈనెల 2 నుంచి రుణపత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించినా.. చివరి నిమిషంలో వాయిదా పడింది.

### ఇన్‌చార్జ్‌ మంత్రి ఆమోదంతోనే..

రాజీవ్‌ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా అధికారులే చేస్తారని నిబంధనల్లో రూపొందించారు. తీరా తుది జాబితా ఎంపికలో అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే ప్రాధాన్యత లభించిందని ఆరోపణలున్నాయి. ఇది వరకే రుణం తీసుకున్న లబ్ధిదారుల సిబిల్‌స్కోర్‌ను రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ఆధారంగా తీసుకుంటున్నారు. సిబిల్‌ స్కోర్‌ అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించినా.. ప్రయోజనం లేకపోయింది.

**మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో దరఖాస్తులు**

| ప్రభుత్వ శాఖలు | దరఖాస్తులు | యూనిట్లు |
|---|---|---|
| ఎస్సీ కార్పొరేషన్‌ | 16,300 | 6,201 |
| ఎస్టీ కార్పొరేషన్‌ | 2,196 | 1,594 |
| బీసీ సంక్షేమ శాఖ | 37,935 | 13,400 |
| ముస్లిం–క్రిస్టియన్‌ మైనార్టీ | 10,217 | 3,415 |

### బయటికి రాని అర్హుల జాబితా..

విభాగాల వారీగా పురపాలక సంఘాలు, మండల కమిటీలు రాజీవ్‌ వికాసం పథకం కింద లబ్ధిదారులను గుర్తించిన అధికారులు మాత్రం అర్హుల జాబితాను బయట పెట్టడం లేదు. జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి ఆమోదం లేకుండా జాబితా బయటపడకుండా శాఖాపరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. రుణ పత్రాల పంపిణీ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌ వర్గాలు పేర్కొంటున్నాయి.